## ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు..
# క్షీరాభిషేకాలు ఎందుకు ?



ఆర్మూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు జేఏసీ నాయకులు

### ఆర్మూర్ డివిజన్ రైతు జేఏసీ నాయకులు, రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు

ఆర్మూర్, అక్టోబర్ 2 : పసుపు బోర్డు కన్నా స్పైసెస్ బోర్డ్ ఎంతో మేలని, పసుపు బోర్డుతో ప్రయోజనం లేదని గతంలో మాట్లాడిన ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం ఎందుకు చేయాలని ఆర్మూర్ డివిజన్ రైతు జేఏసీ నాయకులు, రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు వి. ప్రభాకర్, దేగాం యాదాగౌడ్ ప్రశ్నించారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పసుపు బోర్డుతో ప్రయోజనం లేదని, ఉన్న బోర్డులు తొలగిస్తున్నామని, నూతనంగా బోర్డు ఇచ్చే సమస్యే లేదని గతంలో ఎంపీ అర్వింద్ చెప్పి రైతులను మోసం చేశారని అన్నారు. ఈ విషయమై ఎంపీ అర్వింద్ మాట్లాడిన వీడియోలను విలేకరులకు చూపారు. రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తున్న అర్వింద్.. రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతేడాది పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీ అడిగిన ప్రశ్నకు పసుపు బోర్డు ఇచ్చే అవకాశం లేదని సంబంధిత మంత్రి జవాబు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. స్పైసెస్ బోర్డ్ నుంచి పసుపును వేరు చేసి పార్లమెంట్‌లో రాజ్యాంగపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పసుపు బోర్డు ఆచరణ రూపం దాల్చినప్పుడే స్వాగతం పలుకుతామన్నారు. ఆర్మూర్ డివిజన్‌లో పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు జేఏసీ నాయకులు బీ.దేవారాం, లింగారెడ్డి, సురేశ్, స్వామియాదవ్, ముత్తెన్న, గంగారాం, రాజన్న, భాజన్న, కిషన్, అశోక్, గంగాధర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్

కామారెడ్డి, అక్టోబర్ 2 : కామారెడ్డిలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ సమక్షంలో బీజేపీ, కాంగ్రెస్ నుంచి వివిధ వార్డులకు చెందిన 25 మంది సోమవారం గులాబీ కండువా కప్పుకొని బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులైన బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నామని తెలిపారు. పార్టీ అధికారంలోకి రావడానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ హఫీజ్, మాజిద్, గైని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం

- నలుగురికి ఎల్వోసీలు అందజేసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల



ఎల్ వోసీలను అందజేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 2: ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటున్నామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం మంజూరు కాగా, ఎల్వోసీలను ఎల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఎక్కపల్లి తండాకు చెందిన కాట్రోత్ శివరామ్‌కు రూ. 2.50 లక్షలు, మోతె గ్రామానికి చెందిన ద్యామని ఎలిజబెత్‌కు రూ.లక్ష, కోమటిపల్లి గ్రామానికి చెందిన బోయిని సాయిలుకు రూ. 2 లక్షలు, నల్లమడుగు సొసైటీ చైర్మన్ సుప్పాల రమేశ్ సోదరికి రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రులు వేముల, సత్యవతి రాథోడ్ పర్యటన

భీమ్‌గల్, అక్టోబర్ 2: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మంగళవారం భీమ్‌గల్‌లో పర్యటిస్తారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని సహస్ర ఫంక్షన్ హాల్‌లో గిరిజనులకు రూ.1.70 కోట్లతో 48 తీజ్, సేవాలాల్ భవనాల నిర్మాణాలకు మంజూరైన ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తారు. మధ్యాహ్నం 3గంటలకు మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న వంద పడకల దవాఖానకు రూ.కోటితో అప్రోచ్ రోడ్డు పనులకు శంకుస్థాపన, 3.15 గంటలకు భీమ్‌గల్, వేల్పూర్ రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనుల ఎక్స్‌టెన్షన్ పనులకు శంకుస్థాపన, 3.30 గంటలకు మోర్తాడ్, భీమ్‌గల్ రోడ్డుపై రూ.2.50 కోట్లతో కల్వర్టు నిర్మాణం, 3.45 గంటలకు రూ.15 లక్షల నిధులతో మదర్సా గ్రేవ్ యార్డు ప్రారంభోత్సవం, సాయంత్రం 4.20 గంటలకు పురాణీపేట్ రోడ్డుపై కల్వర్టు నిర్మాణం, 4.40 గంటలకు నందిగల్లీలో రూ.30 లక్షల నిధులతో చేపట్టిన శ్మశానవాటిక ప్రారంభోత్సవం చేస్తారు. సాయంత్రం 5 గంటలకు భీమ్‌గల్-ముచ్కూర్ రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైంటింగ్ ఎక్స్‌టెన్షన్ పనులకు శంకుస్థాపన, 5.20 గంటలకు బోయిగల్లీలో రూ.30 లక్షల నిధులతో చేపట్టిన శ్మశానవాటిక ప్రారంభోత్సవం, 5.40 గంటలకు బొదిరేగల్లీలో శ్మశానవాటిక ప్రారంభోత్సవం, 6 గంటలకు రూ.35 లక్షలతో భీమ్‌గల్ బైపాస్ రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 6.20 గంటలకు భీమ్‌గల్ బడా భీమ్‌గల్ రోడ్డు వెడల్పు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఎక్స్‌టెన్షన్ పనులకు శంకుస్థాపన, 6.30 గంటలకు పాత పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మున్సిపల్ పార్కు ప్రారంభోత్సవం, రథం చెరువు మినీ ట్యాంక్ బండ్ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

## 'బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దు'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 2: పసుపు బోర్డుపై ప్రధాని మోదీతో మరో సారి చెప్పించడం ద్వారా బీజేపీ మరో సారి రైతులను మోసం చేస్తున్నదని బీఆర్‌ఎస్ కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు, నాయకులు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తామని బాండ్ పేపర్ రాసిచ్చిన ఎంపీ అర్వింద్, 5 ఏండ్లు కావస్తున్నా హామీ నెరవేర్చక పోగా ఎన్నికల వేళ మరో సారి రైతులను మోసం చేస్తూ కుట్ర చేస్తున్నారని అన్నారు. గతంలో దివంగత రైతు నేత వేముల సురేందర్ రెడ్డి, రైతు నాయకుడు కోటపాటి నర్సింహ నాయుడు రైతులతో కలిసి ఢిల్లీలోని జంతరమంతర్ వద్ద ధర్నా చేసినప్పుడు తాము అధికారంలోకి వస్తే పసుపు బోర్డు ఇస్తామని బీజేపీ నాయకులు చెప్పారని గుర్తుచేశారు. తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారని మండిపడ్డారు. సమావేశంలో రైతు బంధు సమితి మండల కోఆర్డిటర్ బద్దం రాజేశ్వర్, సర్పంచ్ గడ్డం స్వామి, పీఏసీఎస్ చైర్మన్ కుంట ప్రతాప్‌రెడ్డి, రైతు విభాగం మండల అధ్యక్షుడు బద్దం రాజశేఖర్, నాయకులు సుభాష్ గౌడ్, అజ్మత్ హుస్సేన్, చింత గణేశ్, లోలపు సుమన్, కొత్తపల్లి రఘు, కొత్తపల్లి అశోక్, సంత రాజేశ్వర్, మల్కాయి రాజన్న, రవి కిరణ్, పన్నాల గంగారెడ్డి, వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## యువ రచయిత్రుల సమ్మేళనం

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 2 : హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నవంబర్ 4, 5వ తేదీల్లో యువ రచయిత్రుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఆచార్య ఎలూరి శివారెడ్డి, డాక్టర్ జె. చెన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కథలు, కవితలు, రచనలు చేయాలన్న ఆసక్తి ఉన్నవారితోపాటు రచనలు చేసిన రచయిత్రులు సమ్మేళనంలో పాల్గొనవచ్చని తెలిపారు. కథ, కవిత, నవల, వ్యాసం ప్రక్రియల పరిధి, భాష, శైలి తదితర అంశాలపై తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. 35 ఏండ్లలోపు వారు ఈనెల 15వ తేదీలోగా పేర్లు నమోదు చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు 9603737234 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## తెలంగాణ.. దేశంలోనే నంబర్‌వన్



సింగీతం వాగుపై వంతెన నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బీబీపాటిల్, నాయకులు

- జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్
- సింగీతం వాగుపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

నిజాంసాగర్, అక్టోబర్ 2 : తెలంగాణను సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిపారని జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ అన్నారు. మండలంలోని సింగీతం వాగుపై వంతెన నిర్మాణానికి ఆదివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ జనరంజక పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఎన్నో ఏండ్లుగా సింగీతం గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్య త్వరలోనే పరిష్కారం కానున్నదని, వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 4.80 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఏటా వానాకాలంలో సింగీతం వాగు పొంగినప్పుడు రాకపోకలు నిలిచిపోయేవని, పశువుల కాపర్లు వాగులో చిక్కుకున్నారని గుర్తుచేసుకున్నారు. వంతెన నిర్మాణ పనులకు భూమిపూజ చేయడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దుర్గారెడ్డి, సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు విఠల్, సర్పంచ్ లావణ్య, నాయకులు శ్రీధర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సాయాగౌడ్, మాజీ ఎంపీపీ నాగాగౌడ్, వెంకటేశం పాల్గొన్నారు.

## ముగిసిన సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

ఆర్మూర్, అక్టోబర్ 2: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఆల్ఫోర్స్ పాఠశాలలో రెండు రోజులుగా బాల్ బ్యాడ్మింటన్ సంఘం జిల్లా అధ్యక్షుడు మానస గణేశ్ అధ్యక్షతన సాగుతున్న 42వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల క్రీడలు సోమవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడిన జట్లు నిరాశ పడకుండా పట్టుదలతో తిరిగి గెలిచేలా సిద్ధం కావాలన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకు ఛత్తీస్‌గఢ్‌లోని బిలాయిలో 42వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తారని బాల్ బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్ తెలిపారు.



బాలుర విభాగంలో విన్నర్‌గా నిలిచి ట్రోఫీని అందుకుంటున్న నిజామాబాద్ జట్టు

### విజేతలు వీరే..

బాలుర విభాగంలో నిజామాబాద్ జట్టు ప్రథమ స్థానం, కరీంగనగర్ ద్వితీయ స్థానం, ఆదిలాబాద్ తృతీయ స్థానం, రంగారెడ్డి నాల్గో స్థానంలో నిలిచాయి.

బాలికల విభాగంలో ఖమ్మం జట్టు ప్రథమస్థానం, నిజామాబాద్ జట్టు ద్వితీయ, మెదక్ జట్టు తృతీయ, వరంగల్ జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా, కౌన్సిలర్ బారాడ్ రమేశ్, బీఆర్‌ఎస్ నాయకుడు పండిత్ ప్రేమ్, జిల్లా వ్యాయవ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శ్యామ్, రాజేందర్, కృష్ణమూర్తి, సురేందర్, గటడి రాజేశ్, నాగేశ్, మాధురి, రమణ, నరేందర్, సురేశ్, సునీత, దేవ సుకన్య, భాగ్య, నిఖిత, నరేంద్రాచారి, సంతోష్, ఠాగూర్, చిన్నయ్య, నాగేశ్, హరీశ్, బలరాం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.